# ఈడేరని ఈప్సితం

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైలభ్రమరాంబ.

నిర్మలమైన నీలాకాశంలో మిలమిలా మెరుస్తూ తారలు ఒక్కొక్కటే తమ స్థానాన్ని ఆక్రమించుకొంటున్నాయి. నిండు యవ్వనంతో తన శీతల కిరణాలను వ్యాపింపజేస్తున్నాడు శశాంకుడు. తారతో సరససల్లాపాలాడే ఘటనలు జ్ఞప్తికివచ్చి కాబోలు శశాంకుడు మేఘాలతో దాగుడుమూత లాడుతున్నాడు. టర్నర్ చౌల్ట్రీ జంక్షన్‌లో బస్సుకోసం కాచుకూర్చున్న జనం పల్చబడిపోయారు. ప్రకాశం మాత్రం తన గమ్యస్థానం చేరే బస్సుకోసం నిరీక్షిస్తున్నాడు. ఎంతకీ సిటీబస్సు రాకపోయేసరికి నిరుత్సాహంతో విసుగ్గా నిల్చుని ఏదో దీర్ఘాలోచన చేస్తున్నాడు.

చల్లనిగాలి తెరలు తెరలుగా వీస్తోంది. ఆ గాలితో పాటు మల్లెల సుగంధ పరిమళం ఘుప్పుమంది. ప్రకాశం భావనా ప్రపంచంనుండి దిగజారి మల్లెల మలయమారుతం వీచిన వైపుకి దృష్టిని సారించాడు.

ఎదురుగా ఒక అందాల బరిణె.

చక్రాల్లాంటి కళ్ళతో చురుగ్గా చూస్తోంది.

అందాన్ని విరజిమ్మే గుండ్రని ముఖం.

దబ్బ పండులాంటి శరీరచ్ఛాయ.

దేవలోకం నుండి దిగివచ్చిన అప్సరసేనేమో!

ప్రకాశంకు కళ్ళు చెదిరిపోయాయి.

ఆమె అధరాల బెదురుకు ఆకర్షింపబడ్డాడు.

ఆమె కళ్ళల్లో అనంతాంబరపు నీలినీడల కాంతిరేఖలను కనుగొన్నాడు.

ప్రకాశం తనవైపే పరీక్షగా చూడ్డం గమనించిన ఆ యువతి ముఖం ప్రక్కకు త్రిప్పుకొంది.

ప్రకాశం ఆనందవాహినికి అడ్డు వచ్చింది. అయినా నిరాశపడక ఆమె అందానికి ముగ్ధుడై ఆమెను చూస్తూ వుండిపోవాలనుకొన్నాడు. గాలికి ఆమె కట్టుకొన్న చీర రెపరెపలాడ్తోంది. నల్లటికురులను నున్నగా దువ్వి జారుముడి వేసుకొంది. అయినా ఆ ముంగురులు గాలితో ఆడుకోటానికి వస్తానంటూంటే ముడిలోని జడపిన్నులు నోరునొక్కి కూర్చోమంటున్నాయి. చేతి సంచితో నిల్చున్న ఆ యువతికూడా ఏదో నిరీక్షిస్తూవున్నట్లే కన్పించింది ప్రకాశానికి.

ఆమె తలఎత్తి చూస్తూంటే; ఆమెకి ఎదురుగా వెళ్ళి ఆమెవైపు తీక్షణంగా చూడ్డం సభ్యతా లక్షణం కాదని కొంచెం ప్రక్కకి త్రిప్పుకొన్నాడు ముఖం. ఆమెకేసి చూడకూడదనుకొన్నా, ప్రకాశం మనస్సు మాత్రం వేగిరపడుతోంది. క్షణంలో ఆమె తన హృదయాన్ని దోచుకొంది. అందుచేత ఆమెవైపు చూడకుండా వుండలేకపోయాడు ప్రకాశం.

ప్రకాశం ఆమెను సెంటర్‌లోని మెర్క్యురీలాంప్ కాంతిలో స్పష్టంగా పరిశీలించాడు ఎదురుగా వెళ్ళి-ఆ వెలుగులో ఆమె అప్సరసలా వెలిగిపోతోంది. ఆమె చెక్కిళ్ళ తళుకును, లేతగులాబీరంగుగల ఆమె పెదవుల కదలికను పరీక్షిస్తూ ఆమె ముఖబింబాన్ని తనివితీరా చూస్తున్నాడు ప్రకాశం.

ఆమె మాత్రం ప్రకాశంవైపు కన్నెత్తియైనా చూడలేదు. ఆమె ఉత్సాహం లేకుండా నిర్జీవంగా వుంది. కొన్ని క్షణాలకు ఆమె ప్రకాశంవైపు ముఖం త్రిప్పి 'ఏమండీ! మీ దగ్గర రూపాయి చిల్లరవుందా?' అనడిగింది మృదుమధురస్వరంతో-

ప్రకాశం 'ఆఁ' అన్నాడు మెల్లగా.

ప్రకాశం జేబులో చెయ్యిపెట్టి చిల్లర బైటకి తీసి లెక్కపెట్టాడు. యనభైనయాపైసలే వున్నాయ్. 'అల్లా వెళ్ళి తీసుకువస్తానుండండి' అంటూ తన ప్యాంటు జేబులోనుంచి తీసి అయిదురూపాయలనోటు చేత్తో పట్టుకొని వెళ్ళి పదినిమిషాల్లో చిల్లరతెచ్చి ఆమె చేతికి యిచ్చాడు. జేబులోని సిగరెట్టుపెట్టెతీసి, ఓ సిగరెట్ వెలిగించి ఆ పొగను ధూమశకటంలా వదుల్తూ, కాలరు సవరించుకొని, ఆమె యిస్తూన్న రూపాయి నోటు తీసుకొంటూ, ఆమె వ్రేళ్ళను ప్రయత్న పూర్వకంగా స్పృశించాడు.

ఆమె ప్రకాశాన్ని ఏదో అడుగుదామని అడుగు ముందుకు వేసింది. అంతలోనే దూరంగా హెడ్‌లైట్లు కాంతితో బస్సు వస్తోంటే, ఆ ప్రయత్నాన్నుంచి విరమించి ముఖం త్రిప్పుకొంది. ప్రకాశానికి ఆ బస్సుమీద ఆ సమయంలో వచ్చిన కోపం వర్ణనాతీతం. 'తనపాలిటి విలన్' అని గొణుక్కుంటూండగానే బస్సువచ్చి ఆగింది.

ఆమె బస్సు ఎక్కింది.

అతడూ ఆమె వెనక్కాలే బస్సు ఎక్కాడు.

యిద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

'మీ యిల్లెక్కడండీ?' ధైర్యంచేసి అడిగాడు ప్రకాశం.

'మహారాణీపేటలో'

'నేను ప్రస్తుతం వుంటూన్నదీ అక్కడేనండీ!' తనకి తానే తెలియజేసుకొన్నాడు.

యిద్దరూ బస్సు దిగారు. ఆమెప్రక్కగా నడుస్తూంటే అతని హృదయంలో విద్యుల్లతలు ప్రవహించాయి. తిన్నగా ఆమెతోనే నడుస్తున్నాడు. ఓయింటి ముందుకి వచ్చాక తక్కున ఆగిపోయింది ఆమె. అతడు ఆమెను ఏదో అడగాలనుకొంటూండగానే ఆమె ఆ యింటిలోపలికి వెళ్ళిపోయింది.

వారం రోజుల్లో ప్రకాశం ఆమె పరిచయం సంపాదించాడు. ఆమె పేరు హేమలత. ఆమె చెల్లికి జబ్బుచేస్తే కె. జి. హెచ్. లో చేర్పించారు. మహారాణీపేటలో ఒక గది అద్దెకు తీసుకొని వుంది. వంట చెయ్యటానికి అమ్మమ్మ-కింగ్‌జార్జి హాస్పటల్‌లో చెల్లెలు- ప్రతీ రోజూ హేమలత రెండుపూటలా బస్సుమీద హాస్పత్రికి వెడ్తూ వస్తూవుంటుంది. హేమ బి. ఎ. చదువుకొన్న విద్యావతి-చదువుతోబాటు సంస్కారంకూడా వుంది-చాలా చనువుగా, సరదాగా మాట్లాడుతుంది. ఆమె చెల్లికూడా అక్కలాగే వుంటుంది. ప్రీయూనివర్శిటీ చదువుతోందిట. ఎరమరిక ఎబ్బెట్టులేని ఆ అక్కచెల్లెళ్ళకు తల్లితండ్రులు లేరు. వీరెల్లావున్నా అమ్మమ్మకూడా అభ్యంతరపెట్టదు.

ప్రకాశం బి. ఎ. ప్యాసైన నిరుద్యోగి. అవివాహితుడు. పెళ్ళిచేసుకోవాలన్నా యింతవరకూ అతనికంటికి నచ్చిన అమ్మాయిలు దొరకలేదు. అందుకే ముప్ఫయి ఏళ్లు వచ్చినా బ్రహ్మచారిగా వుండిపోవల్సివచ్చింది. యిన్నాళ్ళకి తన మనస్సుకి నచ్చిన యువతులు ఈ అక్కచెల్లెళ్ళిద్దరే!

హేమలత వచ్చేవరకూ బస్సుస్టాప్‌దగ్గరే నిల్చుని ఎదురుచూచేవాడు ప్రకాశం. అల్లంత దూరంనుంచే ప్రకాశాన్ని చూచీ చూడగానే మందహాసంతో ముఖాన్ని వికశింపజేసి (ఆమె ముఖం జేవురించినా అతని దృష్టికి అల్లా కన్పించదు కాబట్టి) మునిపంటితో పెదవులను నొక్కిపట్టి మందగమనంతో బస్సుదగ్గరకి సాగిపోతోన్న ఆమెను 'హేమలతగారూ!' అని పల్కరిస్తూ వెనక్కాలే వెళ్లేవాడు ప్రకాశం.

హేమలత చేతిలోని కారియర్‌ను అందుకొని ఆమెకా శ్రమ లేకుండా తనే హాస్పత్రివరకూ తీసుకువెళ్లేవాడు ప్రకాశం.

'ఈయన మనకొక అబలారక్షణ మిత్రులు—పేరు ప్రకాశం—ప్రస్తుతం నిరుద్యోగి.' అని చెల్లికి పరిచయం చేసింది హేమలత.

ఆమాట విని కిలకిలా నవ్వింది ఆమె చెల్లి.

చెల్లి నవ్వుకి శృతి కల్పింది అక్క.

వారిద్దరి నవ్వుల్లోనూ కోటి ముత్యాలు గలగల్లాడ్తూన్నట్లు భావించి మురిసి ముగ్ధుడయ్యాడు ప్రకాశం.

'మీరిద్దరూ చాలా ఉత్సాహభరితులైన యువతీరత్నాలు. మీలాంటి విశాల హృదయాలు గలవారిని చూస్తే నాకెంతో ఆనందం' అన్నాడు ప్రకాశం.

నునుసిగ్గుతో మొగమెత్తి చూచారు ఆ అక్కచెల్లెళ్ళు. 'ఈ మహాపట్నంలో మీవంటి ఉదారులను అన్ని వేళల్లోనూ సమాకరింపజేస్తూన్న ఆ విధాత పూజనీయుడు' అన్నారు యిద్దరూ.

ఆమాట వ్యంగ్యంగా అనిపించింది ప్రకాశానికి-తను వాళ్ళను వదలకుండా తిరుగుతూన్నందుకు నిరసనా? నిజంగా తనని అభినందించడమా? అర్థంగాక తికమకపడ్డాడు. తనమీద నిజంగా వీరికి యిష్టంలేకపోతే అంత చనువుగా మాట్లాడ్తారా? తను ప్రేమించినట్లే హేమలతకూడా తనని ప్రేమిస్తూనే వుంటుంది. అయితే ప్రేమ విషయమై ముందుగా తన నోటంట వినాలనే ఆమె అభీష్టంకాబోలు! అనుకొంటున్నాడు ప్రకాశం. ఒక్కసారి ప్రకాశం తన దుస్తులను చూచుకొన్నాడు. వెల్వెట్ పంట్లాం—టెరిలిన్ చొక్కా—టెకోరాన్ టై—ముఖమల్ కోటు—తన దుస్తులను చూస్తే కోటీశ్వరుడని వాళ్ళు అనుకోకుండా వుంటారా? తన గొప్పతనాన్ని, తన చదువునీ, తన విశాలభావాల్నీ, తన ఐశ్వర్యాన్ని గురించి గోరంతలు కొండంతలుగాచేసి యిదివరకే వీళ్ళిద్దరిదగ్గరా తన స్వంత డబ్బా వాయించుకొన్నాడు. తను ప్రేమిస్తూన్నట్లుకూడా హేమలతకి

సూచాయిగా చెప్పుకొన్నాడు. యింక హేమలత అంగీకారం తెలియపర్చగానే తమ పెళ్ళి శుభలేఖలు ప్రింట్ చేయించుకోవడమే తరవాయి.

హేమలత పరిచయమయ్యాక మూడునెలలు మూడు రోజుల్లాగ గడిచిపోయాయి ప్రకాశానికి. ఆమె యింట్లో వుండగా వెడితేమాత్రం అమ్మమ్మ కర్రపుచ్చుకొంటుంది. అందుచేతనే హేమలత బయటకు వచ్చేవరకూ నిరీక్షించడం; ఆమె వచ్చాక యింక క్షణమైనా విడవకుండా ఆమె వెనక్కాలే తోకలా తిరగడం......యిదే అతని దినచర్య.

"ఇవ్వాళ మా చెల్లెని ఆస్పత్రినుంచి విడుదల చేస్తారు. రేపే మేము యిక్కడనుంచి వెళ్ళిపోతాం!" అంది హేమలత.

ఏదో అమూల్యమైన వస్తువు చేయి జారిపోతూన్నట్లు బాధపడ్డాడు ప్రకాశం. కొంచెం తెప్పరిల్లి "హేమలతగారూ! మీ స్నేహితంవల్ల నా జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది. నా మనస్సు, నా శరీరం మీ ప్రేమపాశంతో బంధించి మీవిగా చేసుకున్నారు. మన ప్రేమ ప్రవాహానికి గండిపడకుండా మనిద్దరం-"

ఆమె సగంలోనే అడ్డు తగిలి "ఆపండి ప్రకాశంగారూ! నన్ను గురించి మీరేం తెల్సుకొన్నారని యింతవరకూ అడుగుతున్నారు? అసలు నేనెవరో మీకు పూర్తిగా తెలుసా?" కొంచెం తీవ్రంగా అడిగింది.

"మీ అక్క చెల్లెళ్ళిద్దరూ చదువుకుంటోన్న యువతులు - తల్లి తండ్రులులేక అమ్మమ్మ దగ్గర వుంటూన్నవారు-"

"అంతకి మినహా మీ కేమీ తెలీదు. అవునా? ఈ ఆధారంతోనే మా అందాన్ని చూచి భ్రమించి అమాంతం ప్రేమంచేసి, వదలకుండా బాడీగార్డులా తిరుగుతున్నారు - యిదే ప్రస్తుతంలో మీ వుద్యోగమనుకొంటూ-" కటువుగా అంది హేమలత.

ఇంకేమీ చెప్పలేకపోయాడు ప్రకాశం. అతని బుర్రలో దారంలేని గాలిపటంలా విహరిస్తున్నాయి ఆలోచనలు. అయినా హేమలత వెనకాలే ఆస్పత్రిలోకి వెళ్లాడు. ఆమె చెల్లిని ఆస్పత్రినుండి డిశ్చార్జి చేసి తీసుకువస్తూంటే, తనే స్వయంగా టాక్సీ మాట్లాడి తీసుకు వచ్చి వారితోబాటు వారింటివరకూ వచ్చాడు ప్రకాశం.

ఆ రోజు సాయంత్రం హేమలత బయటకు రాలేదు. ఒంటరిగా ప్రకాశం సాయంత్రంవరకూ గడిపి, సూర్యుడు పశ్చిమ దిశను పూర్తిగా క్రుంగిపోయాక బీచ్‌కి వెళ్ళాడు. సముద్ర కెరటాల మీద పశిడి కాంతులను కురిపిస్తూ, చందమామ మెల్లగా వస్తూంటే, తెల్లని వెన్నెల్లో, తళతళా మెరుస్తోన్న నీళ్ళల్లో హేమలత నవ్వు ముఖమే కన్పిస్తోంది ప్రకాశంకు.

ప్రకాశం ఓ నిశ్చయాభిప్రాయానికి వచ్చాడు. తనతోబాటు మరో యిద్దరు పెద్ద మనుషులను కూడా తీసుకు వెళ్ళి, హేమలత అమ్మమ్మతో మాట్లాడించి, తనకీ హేమలతకీ పెళ్ళి నిశ్చయం చేసుకోవాలి. తనింక హేమలతను వదలి జీవించలేడు. ఇప్పటికి ఎందరు యువతుల జీవితాలతోనో చెలగాటాలాడాడు కాని వారంతా తన హృదయానికి హత్తుకోలేదు - కాని ఈ హేమలతను తనింక మరువలేడు. అందుకే వెంటనే వెళ్ళి మాట్లాడాలనుకొన్నాడు.

ఇద్దరు పెళ్ళి పెద్దల్ని వెంటబెట్టుకొని హేమలత వున్న యింటికి వెళ్ళాడు ప్రకాశం. అప్పుడే వాళ్లు రైలు స్టేషన్‌కి వెళ్ళారని యింటి యజమాని చెప్ప

(తరువాయి 17వ పేజీలో)

కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం. 1938.

విడి ప్రతి — 25 న. పై.

సంవత్సర చందా — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్‌బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్స్‌లలోనూ దొరుకును.

(13వ పేజీ తరువాయి)

డంతో, టాక్సీ మీద వచ్చిన ముగ్గురూ రైలు స్టేషన్‌కి దోవ తీశారు.

అమ్మమ్మతో సహా అక్క చెల్లెళ్ళు రైళ్లు ఎక్కుతోంటే, ప్లాట్‌ఫారం టిక్కట్టు తీసుకు వచ్చాడు ప్రకాశం.

"బామ్మగారూ! నేను మీ హేమలతను ప్రేమించాను - ఆమెను పెళ్ళి చేసుకుంటానని చెప్పటానికే యిప్పుడు మీ దగ్గరికి వచ్చాను" గుక్క త్రిప్పకుండా చెప్పేశాడు ప్రకాశం.

గార్డు విజిల్ ఊదాడు!


"ప్రకాశంగారూ! నాకూ మా చెల్లికీ కూడా పెళ్ళిళ్ళు అయిపోయాయ్ - మా అమ్మమ్మే నాకు అత్తగారు! మీవంటి రౌడీల బారినుండి తప్పించుకోడానికే మేము చదువుకొంటున్నామని అబద్ధం చెప్పాను. మా చెల్లి గర్భిణీ. నిలిచేవరకూ మూడు నెలలు హాస్పత్రిలో వుంచమంటే మావారు తీసుకు వచ్చి దిగబెట్టి వెళ్ళారు. ఆ రోజే మీరు నన్ను చూచారు. మీ వేషం చూడగానే మా ముగ్గురం కూడా మీరు "తుంటరి" అని అర్థం చేసుకొన్నాం. మీరు మమ్మల్ని మర్చిపొండి. శలవ్." అని ఆమె అంటూండగానే ఇంజను కూత వేసి కదిలింది రైలు.

ఆతనికి కన్నీళ్ళు జలజలా రాలాయి-చీకట్లో దూసుకుపోతోన్న రైలును చూస్తూ ఈ దేరని ఈర్సితంతో రాతి బొమ్మలా నిల్చుండిపోయాడు ప్రకాశం.

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ భాద్యులు కాదు.

-సంపాదకుడు



# స్వాతంత్ర్య ధ్వజము!!

●

సింహగర్జనకు అదరిన మేకలు!!
పరుగెత్తినవా పాడు మూకలు!!
ఇక లేవిచట మనకు నూకలు!!
అని ముడిచినవీ తమదు తోకలు!!!

పెద్దలందరి ప్రోత్సాహము!
యువకులలో ఉత్సాహము!!
కలసి తెచ్చె స్వారాజ్యము!!!
నేడె వచ్చె మన రాజ్యము!!!

నేడెకదా తొలగినవీ-
పరదేశపు భూతములు
మన 'భారతి' మీద పాడు-
ఘన స్వాగత గీతములు!!!

తాతయ్య తపః ఫలము!
స్థాపిత 'స్వాతంత్ర్య ధ్వజము'!!
బాపు దీవెనలె బలము!
తర తరముల నిలుపగలము!!!

— పుష్యమి.